# సమావేశాలు, సభలను వీడియో రికార్డింగ్ చేయించాలి

## జిల్లా ఎన్నికల అధికారి డా: బి. గోపి



కరీంనగర్, అక్టోబర్ 26 (వాయిస్ టుడే): అసెంబ్లీ ఎన్నికలకు ప్రకటన జారీ అయిన దృష్ట్యా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలను ఎస్-ఎస్ టి బృందాలు వీడియో రికార్డింగ్ చేయించాలని జిల్లా ఎన్నికల అధికారి డా: బి. గోపి తెలిపారు. హుజురాబాద్ నియోజక వర్గం ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్, రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల అధికారి డా: బి.గోపి పరిశీలించారు. మొదటగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకున్నారు. ఇప్పటికే మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి కావడంతో సంబంధిత నియోజక వర్గాల స్ట్రాంగ్ రూమ్ లకు ఈవీఎం, కంట్రోల్ యూనిట్, వివిపాట్ లను తరలించడం జరిగిందని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్న అనంతరం పోలింగ్ కొరకు సామాగ్రిని తరలించడంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాట్లను సమీక్షించుకోవాలని రిటర్నింగ్ అధికారి ని ఆదేశించారు . అనంతరం చెక్ పోస్ట్ చేరుకొని సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. వాహనాల తనికిని పకడ్బందీగా నిర్వహించాలని, తనిఖీ చేసే ప్రతివాహనానికి సంబంధించిన వివరాలు, సమయం తదితర వివరాలను రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. తనిఖీ లలో పట్టుబడే వాటి వివరాలను వెంటనే సంబంధిత బృందాలకు, రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలని సూచించారు. ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది అందరు హాజరయేటట్లు అధికారులు ఆకస్మిక తనిఖీలను నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆర్వో కార్యాలయానికి చేరుకొని హుజురాబాద్ ఉప ఎన్నికలలో వచ్చిన నామినేషన్, నామినేషన్ల పరిశీలన, ఏర్పాటు చేసిన బృందాలు , వినియోగించిన సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్లను స్వీకరించేటప్పుడు కచ్చితంగా సమయాన్ని నమోదు చేయాలని, ఉదయం 11 గంటలకు ముందు మధ్యాహ్నం 3 గంటల తరువాత వచ్చే నామినేషన్ లను స్వీకరించరాదని, ఆర్వో కార్యాలయంలో నామినేషన్ వేయడానికి వచ్చే వారికొరకు వెయింటింగ్ హాల్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. అదేవిధంగా కార్యాలయంలోని వ్యయ పరిశీలన ఇతర బృందాలకు సంబంధించి బ్యానర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ రిటర్నింగ్ అధికారి రాజు, డీఎస్పీ జీవన్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



జమ్మికుంట పట్టణంలోని కే డి సి సి బ్యాంక్ ను కే డి సి సి కరీంనగర్ జిల్లా చైర్మన్ కొండురు.రవీందర్ రావు సందర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి.రాజేశ్వర్ రావు, కే డి సి సి వైస్ చైర్మన్ పింగిలీ.రమేష్, కౌన్సిలర్ దయ్యాల.శ్రీనివాస్ మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

- వాయిస్ టుడే - జమ్మికుంట



# హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి భద్రత చెక్కులు అందజేత

కరీంనగర్ అక్టోబర్ 26(వాయిస్ టుడే)కరీంనగర్ పోలీసు కమిషనరేట్ లోని కేశవపట్నం పోలీస్ స్టేషన్ లో పని చేస్తూ గుండెపోటుతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కె. పరంధాములు కుటుంబానికి గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయం అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ కె.పరంధాములు ఈ సంవత్సరం జూన్ 27న గుండెపోటుతో మృతి చెందారు. ప్రభుత్వం భద్రత పథకం కింద మంజూరు చేసిన రూ. 8లక్షలు, కార్పస్ ఫండ్ రూ. 50వేల ఆర్థిక సహాయాన్ని పోలీసు కమిషనర్ చెక్కుల రూపంలో ఆయన భార్య శ్యామల, ఇద్దరు పిల్లలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ముని రామయ్య, సీనియర్ అసిస్టెంట్ నల్లా వెంకటేశ్వర్ రెడ్డి, సెక్షన్ క్లర్క్ రహెన సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



# ఏఎన్ఎం లకు సమీక్ష, సమావేశం

కరీంనగర్ అక్టోబర్ 26(వాయిస్ టుడే)కరీంనగర్ లోని స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో కరీంనగర్, హుజూరాబాద్ డివిజన్స్ ఏఎన్ఎం లకు సమీక్ష, సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరుగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గర్భవతుల యొక్క నమోదు చేయించాలని, గర్భవతులను సాధారణ కాన్పులకు ప్రోత్సహించి, 100 శాతం ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాలు జరిగే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించి, 100 శాతం వ్యాధి నిరోధక టీకాలు వేసేలా చూడాలన్నారు. సబ్ సెంటర్ రీజిస్టర్స్ ను మెయింటెన్ చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే.లలితాదేవి తెలిపారు. ఈ సమావేశంలో డీఐఓ డాక్టర్ సాజిదా అతహరి, పీఓ డాక్టర్ సనా జవేరియా, ఎంసీహెచ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎం లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి



## జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

వాయిస్ టుడే ప్రతినిధి రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 26: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో సంస్థాగత ప్రసవాలను పెంచేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రులలో సంస్థాగత, సాధారణ ప్రసవాలు , ఆరోగ్య మహిళా కార్యక్రమం, టీబీ పరీక్షల పురోగతి పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మెడికల్ ఆఫీసర్ లు, స్టాఫ్ నర్స్ లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 24 గంటలు పని చేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖచ్చితంగా డెలివరీల సంఖ్యను పెంచాలన్నారు. రిస్క్ ఉన్న కేసులను జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రి లకు పంపాలని చెప్పారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా గుర్తించిన అనుమానిత క్యాన్సర్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వారిని జిల్లా ఆసుపత్రి కి రిఫరల్ చేస్తూ ఖచ్చితంగా పరీక్షలు చేసుకునేలా మానిటర్ చేయాలన్నారు. అనుమానిత బ్రెస్ట్, ఓరల్ క్యాన్సర్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారు తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు చేసుకునేలా చూడాలన్నారు. డ్రై డే కార్యక్రమం తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో చేపట్టాలన్నారు. జ్వర బాధితులకు టెస్ట్ ల సంఖ్యను పెంచాలన్నారు.డెంగ్యూ , మలేరియా, టైఫాయిడ్ కేసుల ను పూర్తిగా అరికట్టేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. హై రిస్క్ ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు డ్రైడేను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు ప్రధానంగా నీటి నిల్వ లేకుండా జాగ్రత్త పడాలన్నారు. కిరణం కార్యక్రమం కింద ఫిజికల్ హెల్త్ తో సమానంగా మెంటల్ హెల్త్ కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టీబీ బాధితులను గుర్తించడం, చికిత్స అందించడం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ కు సంబంధించి జిల్లాలో మంజూరై పనులు అయ్యేలా చూడాలనీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మెడికల్ కళాశాలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న పనులను మిషన్ మోడ్ లో పూర్తి చేయాలన్నారు. లిఫ్ట్ ను త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్ఓ మినరల్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్ర శేఖర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్ రావు, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీ ధర్ రావు, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత, వేములవాడ ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.



# ఆపద సమయంలో ఒకసారి రక్తదాత, ఎల్లప్పుడూ ప్రాణదాత

## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మెగా రక్తదాన శిబిరం : జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

వాయిస్ టుడే ప్రతినిధి రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 26 :పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా( ఫ్లాగ్ డే) గురువారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, కరీంనగర్, మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటి వారి సహకారంతో మెగా రక్తదాన శిబిరం.మెగా రక్తదాన శిబిరానికి ముఖ్య అతిధిగా హాజరై పోలీస్ అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ వారితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి అందరితో పాటు రక్తదానం చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి ప్రతి ఒక్కరు రక్తదానం చేసే విధంగా అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో డిఎస్పీ లు, సీఐ లు ,ఎస్ఐలు , సిబ్బంది వారి వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో గత మూడు రోజుల నుండి ప్రతి గ్రామానికి వెళ్లి అక్కడ అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు రక్తదానం చేసే విధంగా అవగాహన నిర్వహించడం జరిగింది. విధి నిర్వహణలో కర్తవ్యమే లక్ష్యంగా ప్రాణత్యాగం చేసి అమరులైన పోలీసులను ఈ సమాజం ఎప్పటికీ మరువదని, వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల ధన మాన ప్రాణాలను కాపాడుతూ సంఘవిద్రోహ శక్తుల చేతుల్లో బలైన అమర పోలీసులు వీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.సమాజ రక్షణ వీరులు నిరంతర ధీరులు ప్రాణాలను కూడా లెక్కచేయని విధి నిర్వహణ రక్షకులు, ప్రకృతి విలయతాండవం చేస్తే అభయమిచ్చి కాపాడే ఆప్తులు నిద్రించే సమాజానికి నిద్రపోని కాపలాగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

రెగ్యులర్ పోలీసింగ్ తో పాటు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు, రాష్ట్రంలో ఉన్నటువంటి ఎంతోమంది తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, డెంగ్యూ వ్యాధిగ్రస్తులకు రక్తం చాలా అవసరం వారికి సహాయం కోసం అమరవిరుల స్మరకర్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 600 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, జిల్లాలోని యువకులు, బిఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.సిరిసిల్ల,కరీంనగర్,మంచిర్యాల జిల్లాల రెడ్ క్రాస్ సొసైటీ వారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చాలా చక్కగా సహకరించారు అన్నారు. రక్తదాన శిబిరంలో రక్తదానం చేసేందుకు పెద్ద సంఖ్యలో యువకులు ముందుకు వచ్చి త్సాహంగా పాల్గొనడం అభినందించ దగ్గ విషయం అని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు ఉదయ్ రెడ్డి, నాగేంద్రచారి, రవికుమార్, సి.ఐ లు ఉపేందర్, సధన్ కుమార్, శశిధర్ రెడ్డి, కరుణాకర్, కృష్ణకుమార్,కిరణ్ కుమార్, అనిల్ కుమార్, ఎస్.ఐ లు పోలీస్ సిబ్బంది, బిఎస్ఎఫ్ సిబ్బంది,యువకులు , రాజన్న సిరిసిల్ల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు గుడ్ల రవి ,వరంగల్ అధ్యక్షులు శ్రీనివాస్ ,కరీంనగర్ అధ్యక్షులు కేశవరెడ్డి ,మంచిర్యాల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.ం

# ఎల్లారెడ్డిపేటలో ఊపందుకున్న హస్తం జోరు

**60 మంది కాంగ్రెస్ పార్టీలో చేరిక.**

**తురక్కాశి కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది.**

**కాంగ్రెస్ పార్టీ సిసిల్ల నియోజకవర్గం ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి**

వాయిస్ టుడే రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 26: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని దుమాల గ్రామ శివారులో గల తురక్కాశి కుటుంబాలకు అన్ని విధాలు ఉండగా ఉంటామని సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి గురువారం అన్నారు. ఈ సందర్భంగా 60 మంది కాంగ్రెస్ పార్టీలోకి చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఇటు గుట్టల ప్రాంతంలో బండరాళ్లు కొడితే కేసులు పెడుతూ తురుక కాశీలను ప్రభుత్వం ఇబ్బందుల పాలు చేయడం జరుగుతుందన్నారు. వీరికి ఇప్పటివరకు కనీసం ఇండ్లను ప్రభుత్వం నిర్మించి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వీరిని ఆదుకుంటామని ఆరు స్కీముల గ్యారంటీ పథకంలో వీరిని ఆదుకొని వీరి కుటుంబాలను బాగుపరచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నరసయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు రవి,రఫీక్, చెన్ని బాబు, సలీం, కాశీం తదితరులు పాల్గొన్నారు.



# అనుమానిత లావాదేవిలపై సమాచారం ఇవ్వండి

## బ్యాంకు అధికారులను కోరిన జిల్లా ఎన్నికల అధికారి

## సాధారణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.



వాయిస్ టుడే ప్రతినిధి రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 26 : ఎన్నికల కోడ్ లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో అనుమానిత నగదు లావాదేవీలపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి బ్యాంక్ అధికారులకు సూచించారు. ఖాతాల్లో భారీగా నగదు జమ, విత్ డ్రాల సమాచారాన్ని ఎన్నికల అకౌంటింగ్ నోడల్ ఆఫీసర్ రోజువారీ నివేదిక అందజేయాలని అన్నారు.

గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మినీ మీటింగ్ హాల్ లో జిల్లాలోని అన్ని బ్యాంకుల కో ఆర్డినేటర్ లతో సమావేశం నిర్వహించారు.అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బ్యాంకుల్లో జరిగే డిజిటల్ లావాదేవీల్లో అనుమానిత, లెక్కకు మించిన నగదు ఖాతాలపై నిఘా ఉంచి వారి సమాచారాన్ని ప్రతిరోజూ

పంపించాలని సూచించారు. ఏటీఎంలలో నగదు డిపాజిట్ చేయడానికి వినియోగించే వాహనాలకు ఆయా బ్యాంకులు తప్పనిసరిగా జీపీఎస్ ను ఏర్పాటు చేసి, వాహనాలను పరిశీలించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని, బ్యాంకు అధికారులు తరలిస్తున్న నగదుకు తప్పనిసరిగా డాక్యుమెంట్లు, క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అభ్యర్థి, అభ్యర్థి సంబంధీకుల అకౌంట్ల నగదు లావాదేవీలను అందించాలని తెలిపారు. ఎవరైనా బ్యాంకు ఖాతాలో ప్రతీ రోజు లక్ష రూపాయలు డిపాజిట్ చేసినా, విత్ డ్రా చేసినా, నెలలో రూ. 10 లక్షలు పైబడి నగదు డ్రా చేసినా, బదిలీ చేసినా ప్రతీ రోజు ఆయా బ్యాంకుల అధికారులు ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలని సూచిం చారు. ఆన్లైన్లో జరిగే లావాదేవీలపై గట్టి నిఘా పెట్టాలని కోరారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు ఒకే అకౌంట్ , వివిధ అకౌంట్లకు యూపీఐ ద్వారా గూగుల్ పే, ఫోన్ పే ఇతర యాప్ ద్వారా డబ్బులు జమ చేసినచో వాటి వివ రాలను కూడా పంపించాలని బ్యాంకర్లను ఆదేశిం చారు. రూ. 10 లక్షల నుంచి లావాదేవీలపై ఆదాయపు పన్ను శాఖ కు సమాచారం అందించాలని చెప్పారు.బ్యాంక్ అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వ్యవహరించాలని చెప్పారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి టిఎన్ మల్లికార్జున్ రావు, ఎక్స్పెండిచర్ నోడల్ అధికారి రామకృష్ణ ,జిల్లా ఎడిట్ అధికారిని స్వప్న, ఐటీ నోడల్ అధికారి మహమ్మద్ రఫీ, జిల్లాలోని అన్ని బ్యాంకు ల కో ఆర్డినేటర్ లు పాల్గొన్నారు.